# చిత్తం శివుని మీద...

ఆ రోజు శనివారం. సాయంత్రం ఏడుగంటలు. బొంబాయి ఆంధ్ర మహాసభ ప్రాంగణం ప్రేక్షకులతో కిటకిటలాడుతోంది. అందులో నేనూ ఉన్నాను. పాపులర్ రచయిత శ్రీ దండమూడి సురేంద్రనాథ్ గారితో ముఖాముఖి! అంత జనం రావడంలో ఆశ్చర్యమేముంది?

ఆయన నా అభిమాన రచయిత కాకపోయినా తెలుగు సాహిత్యరంగంలో వెలుగుతున్న ఒక ధ్రువతార. విమర్శకులు సైతం ఆయన్ని గౌరవించేటట్టుగా, ఎన్నో రచనలు సృష్టించిన మేధావి ఆయన, ఒక విమర్శకునిగా ఆయన్ని కడిగేసే అవకాశం దొరికింది గదా అని సంతోషపడ్డాను.

ప్రేక్షకులు, ముఖ్యంగా ఆడవాళ్లు ఆయన రచనల గురించి, వాటి నేపథ్యం గురించి ప్రశ్నలు గుప్పిస్తున్నారు. కొన్ని పాత్రల చిత్రీకరణ గురించి విమర్శిస్తున్నారు. పత్రికారంగంలో ఆయన సృష్టించిన అలజడులను ఉటంకిస్తున్నారు. చాలా సంయమనంతో, ఓపిగ్గా ఆయన సమాధానాలు ఇస్తున్నారు.

నాకూ కొన్ని ప్రశ్నలు అడగాలని ఉంది. కాని ఛాన్స్ దొరకడం లేదు. ఆయన ఆడవాళ్ళకే ప్రాధాన్యం ఇస్తున్నారు. టైము చూసుకున్నాను. ఎనిమిదిన్నర. నేను బయలుదేరే సమయం. దాదర్ నుండి అంధేరీకి ట్రైన్లో, అక్కడి నుండి మా క్యాంపస్ వెహికిల్‌లో వెళ్ళాలి. చివరి వెహికిల్ తొమ్మిదిన్నరకి ఉంటుంది. ఆ తర్వాతైతే ఆటోకు యాభై రూపాయలు తగలెయ్యాలి. బస్సులో పోదామంటే మనసొప్పదు. హోదా ఒకటి ఏడ్చింది గదా! బస్సు క్యూలో నుంచోడానికి, ఆ తొక్కిసలాటలో బస్సు ఎక్కడానికి గాని, సీటు దొరక్క నిల్చోవడానికి గాని, వయసు సహకరించడం లేదు. మనసు కూడా ససేమిరా అంటూంది. ప్రశ్నలను మనసులోనే అణగద్రొక్కి ఇంటికి బయలుదేరాను. ట్రైన్లో కూర్చున్నానన్న మాటేగాని మనసంతా మహాసభలోనే చిక్కుకుపోయింది. 'మంచి అవకాశం జారవిడచుకున్నానే' అని మథన.

ఇంటికి చేరేసరికి పదింబావు. ఫ్రెష్ అయి భోజనానికి కూర్చున్నాను. "ఏమిటండీ అదోలా ఉన్నారు? సభలో ఏమైనా గొడవైందా?" భోజనంవడ్డిస్తూ శ్రీమతి. "గొడవేమి జరగలేదు గానీ ఆరుగంటలకు అనుకున్న సమావేశం ఏడున్నరకు మొదలయింది. మీ ఆడవాళ్లు దండమూడిని వదిల్తేగా నా బోటి వాళ్ళ ఛాన్సు వచ్చేది? యథాప్రకారం ఎనిమిదిన్నరకు బయలుదేరాను. క్యాంపస్ వెహికిల్ మిస్ అయితే ఎంత కష్టమో నీకు తెలుసుగదా?"

"ఓస్ అంతేనా దీన్లో కొత్త ఏముంది? మీరూ మీ ఆంధ్ర మహాసభ, ఎంతకీ మారరండీ. వాళ్ళు సమయానికి కార్యక్రమం మొదలుపెట్టరు. మీరు క్యాంపస్ వెహికిల్ మిస్ కారు,

ఇక కార్యక్రమం చివరి దాకా ఉండే యోగం మీకెలావస్తుందండీ?"

"ఆరు గంటలకి మొదలు పెడితే ఏ కార్యక్రమం అయినా ఎనిమిదిన్నరకు ముగుస్తుంది. అప్పుడు, దూరంగా ఉండే మనలాంటి వారికి సౌకర్యం గదా? ఏదో మన భాషపై మక్కువతో వెళితే ప్రతిసారీ ఇలా మధ్యలో రావాల్సి వస్తోంది. ప్రేక్షకులు ఏడైతేగానీ రారు. వారు రాందే కార్యక్రమం మొదలుపెట్టేదెలా? అని నిర్వాహకుల మీమాంస, మధ్యలో నాలాంటి సిన్సియర్ కళాభిమానులు నష్టపోతున్నారు" "చిత్తం శివుని మీద, భక్తి చెప్పుల మీద అని మీలాంటి వారినే అంటారు" శ్రీమతి ఫక్కుమంది.

"ఇందులో నవ్వడానికేముందీ? నీలాంటి అరసికులకు మా బాధ అర్థంకాదు. "బాగా అర్థమౌతుందండీ. కాకపోతే మాలాంటి అ ... రసికులు, తమ అభిరుచిని నొక్కిపెట్టి యాభైరూపాయల కొరకు కక్కుర్తి పడరు." నాకు పొలమారింది. గ్లాసెడు నీళ్ళు త్రాగాను. అన్నం గొంతు జారిందిగాని, శ్రీమతి చురకమంట ఇంకా ఆరలేదు. ప్రొఫెసర్ గిరీ వెలగబడుతున్న నాకు యాభై రూపాయలు ఓ లెక్కకాదు. ఫ్రీగా వచ్చే దానికి ఖర్చు ఎందుకు పెట్టాలీ అని మనసు ఓ వైపు లాగుతుంది. అదే శ్రీమతితో అన్నాను. ఇంట్లో వంటలు చేసుకునే నీకు కళాభిమానం అంటే ఏం తెలుసు? అని నేనూ ఓ చురక అంటించాను. "అవ్వకావాలి, బువ్వకావాలి అంటే ఎలా కూదురుతుందండీ? వెనకటికి ఓ అత్త కోడలిని వదలి తీర్థయాత్రలకి వెళ్ళిందట.కాని ఆమె మనసంతా ఇంటిమీదేనట. నా కొడుక్కి కోడలు ఏమి నూరిపోస్తుందో? తిరిగి వెళ్ళిన తర్వాత నా పెత్తనం సాగదేమో? కొడుకు కోడలును కూడా తీసుకువస్తే బావుండేదేమో! అని ఒకటే చింత. అక్కడ కోడలేమో ఈ రోజు అత్తగారు ఫలానా దేవస్థానంలో ఉంటారు, యాత్రపట్టిక ప్రకారం అత్తగారు ఏ రోజు ఏ దేవుని దర్శనం చేసుకున్నారో, ఆ రోజు ఆ దేవునికి మొక్కడం చేసిందట. చివరికి యాత్రలు చేసిన అత్తగారికి దక్కని పుణ్యఫలం, ఇంట్లో ఉన్న కోడలికి దక్కిందట. మీతో పాటు నేను సభకి రాకపోయినా మీపాటి భాషాభిమానం నాకూ ఉంది. కళాభిరుచీ ఉంది. కాకపోతే మీతో వస్తే తృప్తి కలగదు. మీదృష్టి ఎంతసేపు గడియారం వైపే, ధ్యాస క్యాంపస్ వెహికిల్ పైనే. అదెక్కడ మిస్సవుతుందో అన్న చింతే. కార్యక్రమం మీరు పూర్తిగా చూడరు, నన్ను చూడనివ్వరు".

శ్రీమతి బాగా వడ్డించింది!

భోజనం అయిందనిపించి లేచాను.

పడకగదిలో కూడా బెట్టు సడలలేదు. ముభావంగానే ఉన్నాను.

"అది కాదండీ! మనకి డబ్బుకేం కొదవ చెప్పండి? నెలకింతని ఆటో చార్జీలకు కేటాయించండి మీ ఇష్టప్రకారం అన్ని కార్యక్రమాల్లో పాల్గొనండి అప్పుడిక దిగులుండదు" శ్రీమతి దిగి వచ్చింది. ఆ అనునయ వాక్యాలు నన్నూ చల్లబరిచాయి. నేనెంత ప్రొఫెసర్నయినా ఇలాంటి విషయాల్లో శ్రీమతి బుర్రే బా.గా పనిచేస్తుంది. కార్యక్రమాలు పూర్తయే దాకా ఉండక, ఆ తర్వాత వాపోయేకంటే ఆటో చార్జీలు పెట్టుకునైనా నా అభిరుచిమేరకు ఆంధ్రమహాసభ సాహిత్య, సాంస్కృతిక కలాపాలలో పాల్గొనాలని నిశ్చయించుకున్నాను. ఇప్పుడు నా చిత్తం, భక్తి రెండూ శివుని మీదే! చేతులు మాత్రం...?

**ఆదివారం ఆంధ్రప్రభ 14-10-2001**